సాక్షి కర్నూలు
బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని నందీశ్వరునికి, బయలువీరభద్ర స్వామి వారికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



నగదు స్వాధీనం

ఆళ్లగడ్డ: బాచాపురం మెట్ట వద్ద ఆధారాలు లేకుండా ముత్తలూరు పెద్దసుబ్బన్న తరలిస్తున్న రూ.1.95 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.



యువత.. సంక్షేమ బావుటా..!

సాధారణ ఎన్నికల్లో ఈసారి యువ ఓటర్లే కీలకం కానున్నారు. మొత్తం ఓటర్లలో వారే సగభాగం ఉండటంతో గెలుపోటములను నిర్ణయించనున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:46
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:49
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:43
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:44

హదీస్ వెలుగు :

తరచూ ''అస్తగ్ ఫిరుల్లాహ్'' చదువుతూ ఉండండి. ''తౌబా'' చేస్తూ ఉండండి. తెలిసీ, తెలియక చేసిన పాపాలను అల్లాహ్ హరిస్తారు.

- పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌కు 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 22వ తేదీలోపు అత్యవసర సర్వీసుల్లో పనిచేసే వివిధ శాఖలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సంబంధిత నియోజకవర్గాల ఆర్వోల వద్ద దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలో 33 విభాగాల వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం అవకాశం ఉంది. ఇందుకోసం అర్హులైన ఉద్యోగులు ఫారం–12డీని సమర్పించాల్సి ఉంటుంది.

త్వరలో మొబైల్ రైతుబజార్లు

- కర్నూలులో ఉల్లి, నంద్యాలలో కందిపప్పు విక్రయం

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు మొబైల్ రైతుబజార్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద అన్ని జిల్లాల్లో పండే ప్రధాన పంటలను మొబైల్ రైతుబ జార్ల ద్వారా వినియోగదారులకు అందించేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఉల్లి, నంద్యాల జిల్లాలో కందిపప్పు మొబైల్ రైతుబజార్ల ద్వారా విక్రయించనున్నారు. బుధవారం మొబైల్ రైతుబజార్ల నిర్వహణపై జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణ మూర్తి కర్నూలు నగరంలోని ఎస్టేటు అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అనుమతితో కర్నూలులో నాణ్యమైన ఉల్లి గడ్డలను మొబైల్ రైతుబజారు ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏ రోజుకారోజు మార్కెట్ ధరలను బట్టి ఉల్లి విక్రయాలు ఉంటాయని తెలిపారు. అతి త్వరలో మొబైల్ రైతుబజార్లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో ఎస్టేటు అధికారులు హరీష్‌కుమార్, కళ్యాణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుంటకు జలకళ



ఎల్ఎల్‌సీ నీటితో నిండిన కొత్తూరు కుంట

కోడుమూరు రూరల్ : మండలం కొత్తూరు గ్రామ పరిధిలోని కుంట జలకళను సంతరించుకుంది. వేసవి దృష్ట్యా గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా కుంటను ఎల్ఎల్‌సీ నీటితో నింపారు. నీటి కష్టాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులకు సర్పంచు మెహరున్‌బీ, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయాలి

ఓర్వకల్లు : అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిపేలా చూడాలని, కష్టతరమైన కేసులను మాత్రమే పై ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవమైన మహిళలకు ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసే బాధ్యత సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లదేనన్నారు. ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. గర్భిణుల నమోదు మొదలు, ప్రసవించిన ఆరు మాసాలకు వరకు అప్రమత్తంగా వుండాలన్నారు. మాతాశిశు మరణాల తగ్గింపులో ఆశా వర్కర్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవ, రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

కుట్ర ఫలించి.. గడప దాటించి!

నేటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

- వయోవృద్ధులు, నడవ లేనివారు, రోగులు, వికలాంగులకు కాస్త ఊరట
- ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఆదేశం
- దాదాపు 5 ఏళ్ల తర్వాత పింఛన్ల కోసం గడప దాటనున్న లబ్ధిదారులు
- మండుటెండల్లో ఇక్కట్లకు గురిచేయడం పట్ల టీడీపీపై గుర్రు



చంద్రబాబు అండ్ కో కుట్ర ఫలించింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకూడదనే పంథాన్ని నెగ్గించుకున్నారు. ఫలితంగా పింఛన్‌దారులకు పింఛన్ కష్టాలు పునరావృతం కానున్నాయి. తెలుగుదేశం నేతలు, చంద్రబాబు అనుంగు శిష్యుడు నిమ్మగడ్డ రమేష్ ఒకవైపు కోర్టుల్లో వలంటీర్లపై కేసులు వేయడం.. మరోవైపు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడం తెలిసిందే. దీంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ దూరం పెట్టి సచివాలయాల ద్వారా పంపిణీకి అనుమతి ఇచ్చింది. ఐదేళ్లుగా ఇంటి వద్దే పింఛను అందుకుంటున్న లబ్ధిదారులు టీడీపీ కుట్రతో మొదటిసారి గడప దాటాల్సి రావడం గమనార్హం.



కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 3 నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించి 4,69,789 పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.140,15,56,500 బ్యాంకులకు విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాలకు పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి బుధవారం నగదు డ్రా చేయనున్నారు. వీలైనంతవరకు బుధవారమే పంపిణీ చేసే విధంగా ఆదేశాలు జారీ అయినా గురువారం నుంచి పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ మొదలవుతుంది. కర్నూలు జిల్లాలో 672, నంద్యాల జిల్లాలో 516 సచివాలయాల్లో పింఛన్‌ల పంపిణీ జరుగుతుంది. 6వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 2,46,863 పింఛన్లకు రూ.73.90 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,22,935 పింఛన్లకు రూ.66.24 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. దాదాపు ఐదేళ్ల పాటు వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి సొమ్ము అందజేసేవారు. దీంతో పింఛన్‌దారులు వలంటీర్లను గుండెల్లో పెట్టుకున్నారు. ఎలాంటి చీకూచింతా లేకుండా పింఛన్ పొందుతున్న వారికి పచ్చ కూటమి కారణంగా మళ్లీ కష్టాలు వచ్చి పడ్డాయి. బ్యాంకుల నుంచి నగదు డ్రా చేయాల్సి ఉన్నందున మొదటి రోజు పంపిణీలో జాప్యం జరుగుతుంది. 5, 6 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు దాదాపు 44 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఇంతటి తీవ్రమైన ఎండల్లో పింఛన్ దారులు కిలో మీటర్ల దూరంలోని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు 4.70 లక్షల మందికి కష్టాలు తెచ్చిపెట్టిన టీడీపీపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికే పింఛన్ పంపితే... చంద్రబాబు మళ్లీ పాత పద్ధతిలో సచివాలయాల చుట్టూ తిప్పేలా చేశాడని పింఛన్‌దారుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది. సచివాలయంలో 10 మంది వరకు ఉద్యోగులు ఉంటారు. అందరికీ పింఛన్ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పింఛన్ల పంపిణీ ముగిసే వరకు సచివాలయాల వద్ద షామియానాలు వేయడంతో పాటు నీటి సదుపాయం కల్పించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

వీరికి ఇంటి వద్దే పంపిణీ

- ఉమ్మడి జిల్లాలో 4.69 లక్షల పింఛన్‌లు ఉండగా... ఇందులో వికలాంగులు, వయోవృద్ధులు (నడవలేని వారు), మంచానికే పరిమితమైన వారు, కిడ్నీ, డయాలసిస్ పేషెంట్లకు ఇంటి వద్దే సచివాలయ ఉద్యోగులు పింపిణీ చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.
- ఇటువంటి వారు దాదాపు 30–40 శాతం మంది ఉంటారు.
- సచివాలయాలకు దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.
- సచివాలయాల్లేని మజరా గ్రామాల్లో పింఛన్ల సంఖ్య ఆధారంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఒకవైపు 30–40 శాతం మందికి ఇంటి వద్ద.. మిగిలిన వారికి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయనుండటం గందరగోళానికి దారితీసే పరిస్థితి ఏర్పడింది.

బాబు ఎంత పని చేశావయ్యా..



జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఐదేళ్లు ఎప్పుడూ పింఛన్ కోసం ఆలోచించలేదు. ఠంచన్‌గా ప్రతి నెల 1వ తేదీన వలంటీర్లు ఇంటికొచ్చి ఇచ్చారు. చంద్రబాబు చేసిన పనికి పింఛన్ తీసుకునే వాళ్లంతా ఇప్పుడు భయపడుతున్నారు. మా లాంటి వారికి ఇంటికొచ్చి ఎవరు వస్తారో తెలియదు. ఎవరినీ అడగాలో అర్థం కావడం లేదు. చంద్రబాబుకు ముసలోళ్ల మీద దయలేదు.

–కరీంబీ, దబ్బ్యా.గోవిందిన్నె, దొర్నిపాడు మండలం

లైన్‌లో ఎండకు ఎంత సేపు నిలవాలనో..



నాకు వితంతు పింఛన్ వస్తుంది. ప్రతి నెలా వలంటీర్లు తెల్లవారుజామున ఇంటి దగ్గరకు వచ్చి ఇచ్చారు. కానీ ఈ నెల ఒకటవ తేదీ వచ్చింది కానీ పింఛను అందలేదు. వలంటీర్‌ను అడిగితే సచివాలయానికి రావాలని చెబుతున్నారు. అందరూ అక్కడికి పోతే పెద్ద లైన్‌లో ఎండకు ఎంత సేపు నిలవాలనో తెలియడం లేదు. కూలీకి వెళ్లకుండా పింఛన్ కోసం వెళ్లాల్సి వస్తుంది. చంద్రబాబు మాలాంటి పేదల మీద ఎప్పుడూ ఏడుస్తుంటాడు.

– తెలుగు వెంకట లక్ష్మమ్మ, గిద్దలూరు గ్రామం, సంజామల మండలం

మా ఉసురు తగులుతుంది



టీడీపీ పాలనలో పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయలేదు. అప్పట్లో పంచాయతీ కార్యాలయం వద్ద వారాల కొద్ది ఎదురు చూసేటోళ్లం. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ ద్వారా ఒకటో తేదీ తెల్లవారుజామున ఇంటి వద్దకు పింఛన్ ఇచ్చి పంపుతున్నాడు. పింఛన్లు వలంటీర్లు ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకోవడం దారుణం. చంద్రబాబుకు ఓటు వేసే ప్రసక్తే లేదు. మా ముసలోళ్ల ఉసురు ఆయనకు తగులుతుంది. – బోయ నరసమ్మ, నాగలదిన్నె, నందవరం మండలం

పింఛన్ల పంపిణీకి సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు

- వికలాంగులు, దీర్ఘకాలిక రోగులు, మంచానికే పరిమితమైన వారికి ఇళ్ల వద్దే పింఛను
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి.సృజన



కర్నూలు (సెంట్రల్): సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. అయితే విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక రోగులు, అస్వస్థతతో ఉన్న వారు, మంచానికే పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పెన్షన్ పొందుతున్న వృద్ధ మహిళలకు మాత్రం సచివాలయ ఉద్యోగులు ఇళ్లకే వెళ్లి పింఛను పంపిణీ చేయాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పెన్షన్ల పంపిణీపై ఆమె ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సచివాలయాల ప్రాంగణంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో షామియానాలు, తాగు నీటి వసతి, కుర్చీలు.. ఇతరత్రా సదుపాయాలు కల్పించాలన్నారు. బుధవారం నగదు డ్రా చేసి సాయంత్రం నుంచి పింఛను పంపిణీని ప్రారంభించాలన్నారు. ఈనెల 6లోపు పంపిణీ పూర్తి కావాలన్నారు. సచివాయాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి పంపిణీ చేపట్టాలన్నారు. పంపిణీని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ప్లాంటేషన్‌పై శ్రద్ధ చూపాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించి ఆర్డర్ తీసుకొని శిక్షణకు హాజరుకాని వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఆదోని మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎమ్మిగనూరు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు





మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన, సమావేశానికి హాజరైన అధికారులు

- ఎన్నికల కమిషన్‌కు లోబడి విధులను నిర్వర్తించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన

ఆలూరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన హెచ్చరించారు. ప్రలోభాలకు లొంగకుండా, ఎన్నికల కమిషన్‌కు లోబడి విధులు నిర్వర్తించాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కోడ్ అమల్లో ఉన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పేయింటింగ్ తొలగించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతిపౌరుడు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. కలెక్టర్ వెంట వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.

రేపు ఆర్‌యూలో క్విజ్

కర్నూలు కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉదయం 9.30 గంటలకు రాయలసీమ విశ్వవిద్యాలయంలోని వర్సిటీ సెనేట్ హాల్‌లో క్విజ్ చాంపియన్‌షిప్ –2024 రీజినల్ క్వాలిఫైయర్స్ రౌండ్‌ను వీసీ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్ కుమార్ ప్రారంభిస్తారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న తెలిపారు. మంళవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా పరిధిలోని 20 కళాశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

ఎల్ఎల్‌బీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలో అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు రెండో సెమిస్టర్‌లో 38 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ఆరుగురు, మూడో సెమిస్టర్‌లో 54 మందికి 11, ఐదో సెమిస్టర్‌లో 141 మందికి 26 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో రెండో సెమిస్టర్‌లో 18 మందికి ఐదుగురు, మూడో సెమిస్టర్‌లో 9 మందికి ఇద్దరు, ఏడో సెమిస్టర్‌లో 20 మందికి 10, తొమ్మిదో సెమిస్టర్‌లో ఇద్దరికి ఒకరు ఉత్తీర్ణత సాధించారన్నారు.

భక్తుల దాహం తీర్చేలా..

- ఉగాది ఉత్సవాల్లో రోజుకు 1.35 కోట్ల లీటర్ల నీటి సరఫరా



క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన సింటెక్ ట్యాంకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో త్వరలో జరుగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు మంచినీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బంది చర్యలు చేపడుతున్నారు. ఉత్సవాలలో రోజుకు 1.35 కోట్ల లీటర్ల నీటి సరఫరా చేయనున్నారు. క్షేత్ర పరిధిలో మహాశివరాత్రికి ఏర్పాటు చేయబడిన మంచినీటి కుళాయిలన్నింటిని ఉగాది ఉత్సవాలలో వినియోగించుకునేలా వీలు కల్పించారు. క్షేత్ర పరిధిలో పలుచోట్ల 450పైగా మంచి నీటి కుళాయిలను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రింగ్‌రోడ్డు, ఉద్యానవనాలు, ఆరుబయలు ప్రదేశాలు మొదలైన చోట్ల 40కి పైగా సింటెక్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. అలాగే 15 అదనపు సింటెక్ ట్యాంకులను ఏర్పాటు చేయడంతో పాటు క్షేత్రపరిధిలో శాశ్వతంగా 11 ఆర్‌సిసి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా క్షేత్ర పరిధిలో 34 ఆర్‌ఓ ప్లాంట్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. సాక్షిగణపతి, హఠకేశ్వరం, శిఖరేశ్వరం, కైలాసద్వారం, పెద్దచెరువు తదితర ప్రదేశాలకు కూడా మంచినీటి సరఫరా చేయనున్నారు. భీమునికొలను వద్ద తాత్కాలికంగా 1,600 మీటర్ల పొడవున హెచ్‌డీపీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిసరఫరా చేస్తున్నారు. కైలాసద్వారం – భీమునికొలను మార్గమధ్యంలో 1,000 లీటర్ల సామర్థ్యం ఉన్న 8 సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఉగాది ఉత్సవాల్లో భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు.

కోడుమూరు టిక్కెట్ ఎంతకు అమ్ముకున్నారు?

సమావేశంలో జోనల్ కోఆర్డినేటర్‌ను నిలదీసిన కోట్ల వర్గం

- బొగ్గుల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన నియోజకవర్గ ముఖ్య నాయకులు
- మార్చకపోతే ఓడిస్తామంటూ తేల్చి చెప్పిన కార్యకర్తలు



కర్నూలు: కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై వ్యతిరేకం భగ్గుమంటోంది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గంగా ముద్ర పడిన వారంతా టీడీపీ జోనల్–5 కోఆర్డినేటర్ బీద రవిచంద్రపై తిరుగుబాటు చేశారు. బొగ్గుల దస్తగిరి అభ్యర్థిత్వాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న కోట్ల వర్గం రెండు రోజుల క్రితం నగరంలోని భూపాల్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆకెపోగు ప్రభాకర్‌ను రెబల్ అభ్యర్థిగా బరిలో నిలపాలని తీర్మానించారు. విషయం తెలుసుకున్న ముగ్గురు జిల్లా ఇన్‌చార్జి నాయకులు రాజీ కుదిర్చేందుకు కర్నూలుకు చేరుకున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కోడుమూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నేతలతో మంగళవారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే కోడుమూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఎంతకు అమ్ముకున్నారు... ఒక్కనాడు కూడా పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనలేదు. అధిష్టానం ఏకపక్ష నిర్ణయంతో బొగ్గుల దస్తగిరిని ప్రకటించారంటూ జోనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రపై తిరుగుబాటు చేశారు. ఈ సందర్భంగా కొద్ది సేపు ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాక సమావేశంలో గందరగోళం నెలకొంది. సమావేశంలో ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు బీటీ నాయుడు, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల పరిశీలకులు డాక్టర్ శ్రీనివాసులు కూడా పాల్గొన్నారు. దస్తగిరి అభ్యర్థిత్వాన్ని పునఃపరిశీలించాలని, లేకుంటే ఆకెపోగు ప్రభాకర్‌ను రెబల్ అభ్యర్థిగా బరిలోకి దింపి తమ తడాఖా ఏంటో చూపిస్తామంటూ కోట్ల వర్గీయులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇదే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని బీద రవిచంద్ర నాయకులకు హామీ ఇచ్చి సమావేశాన్ని ముగించారు.

'పచ్చ'నోట్ల సానుభూతి!



బాధితుడికి డబ్బు అందజేస్తున్న టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి



డబ్బు అందజేస్తున్న టీడీపీ నాయకుడు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

- ఓదార్పు ముసుగులో డబ్బు పంపిణీ
- కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు

కల్లూరు/గూడూరు రూరల్: ఎన్నికల వేళ టీడీపీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. చీరలు పంపిణీ చేస్తున్నారు.. నిర్ణీత సమయానికి మించి ప్రచారం కొనసాగిస్తున్నారు.. తాజాగా గడ్డివాములు దగ్ధం కాగా, డబ్బు ముట్టజెప్పి కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించారు. వివరాల్లోకి వెళితే.. కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పర్లలో మంగళవారం ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మంగలి నాగసుంకన్న, అశోక్‌కుమార్‌రెడ్డి, కుర్వ అయ్యన్న, కుర్వ సోమన్నకు చెందిన నాలుగు గడ్డివాములు ప్రమాదవశాత్తూ అంటుకున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే ఆలోపే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి బాబాయి బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి బాధితులను ఓదార్పే ముసుగులో గ్రామానికి చేరుకున్నారు. కోడ్ అమలులో ఉండగా ఎలాంటి డబ్బు పంపిణీ చేపట్టరాదనే విషయాన్ని పక్కనపెట్టి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున పంపిణీ చేశారు. అదేవిధంగా టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరు చరితారెడ్డి భర్త గౌరు వెంకటరెడ్డి కూడా బాధితులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున అందించారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నేతలు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. అందుకు విరుద్ధంగా టీడీపీ నేతలు వ్యవహరించడం గమనార్హం.

క్లుప్తంగా

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

పత్తికొండ రూరల్: ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించరేమోనని మనస్తాపానికి గురైన ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని పులికొండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు, యువతి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకే సామాజిక వర్గమైనా రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉండటంతో పెద్దలు అంగీకరించరేమోనని భయపడి గ్రామానికి దూరంగా ఉన్న పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న వీరిని ఉపాధి కూలీలు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. కాగా ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

అవమాన భారంతో ఆత్మహత్య

కొలిమిగుండ్ల: పాలీష్ ఫ్యాక్టరీ యజమాని దూషించాడని ఓ కార్మికుడు అవమాన భారంతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్లకు చెందిన మామిడాకుల రాజు (40) ఇటిక్యాల సమీపంలోని పాలీష్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఫ్యాక్టరీ యజమాని వద్ద లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి పనికి వెళ్లకపోవడంతో యజమాని ఉదయం కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రాజు ఇంటికి వచ్చాడు. అతను లేకపోవడంతో కార్మికుడి భార్య నాగవేణిని కులం పేరుతో దూషించి అవమానించాడు. కొద్ది సేపటి తర్వాత భర్త రాజు ఇంటికి చేరుకుని విషయం తెలుసుకున్నాడు. ఆ తర్వాత ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే యజమాని దూషించాడు. అవమానం తట్టుకోలేక రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కొలిమిగుండ్ల లేబర్ ఫ్యాక్టరీ అపస్మారక స్థితిలో పడి ఉన్న రాజును గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

గోస్పాడు: హత్య కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు నంద్యాల డీఎస్పీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగవారం నిందితుల అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. గోస్పాడుకు చెందిన మద్దిలేటి, జూలేపల్లెకు చెందిన దొరకొండ సుదర్శన్(38) ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం గోస్పాడులో మద్యం తాగారు. వారి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. గొడవ విషయాన్ని మనసులో ఉంచుకుని ప్రతీకారం తీర్చుకోవాలని మద్దిలేటి భావించాడు. జూలేపల్లెకు వెళ్లి సుదర్శన్‌పై మద్దిలేటి, అతని అన్న వెంకటేశ్వర్లు, కుమార్, సువర్ణ కత్తితో దాడి చేశారు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సుదర్శన్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు నమోదు చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు వివరించారు. సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.

యువత..సంక్షేమ బావుటా..!

- యువత చూపు..వైఎస్‌ఆర్‌సీపీ వైపు
- ఐదేళ్ల పాలనలో యువతకు అండగా నిలిచిన సీఎం జగన్
- పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యకు బాసట
- 2.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగం నుంచి బయట పడిన యువతీయువకులు
- జిల్లాలో కొత్త ఓటర్లు 42,506 మంది, మొత్తం యువ ఓటర్ల సంఖ్య 10.20 లక్షలు యువ ఓటు అటు వైపే

ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. వారు ఎటు వైపు మొగ్గితే ఆ నాయకులే గెలుపుతీరాలకు చేరనున్నారు. జిల్లాలో మొత్తం 20,30,377 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో సగానికి పైగా మంది యువ ఓటర్లే. వీరంతా రానున్న ఎన్నికల్లో గత ఐదేళ్ల ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పాటు అందిస్తూ లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన వైఎస్ జగన్‌కు తోడుగా నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు.

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో మొత్తం 20,30,377 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 10,01,971, స్త్రీలు 10,28,096 మంది, ఇతరులు 310 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇక కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న ఓటర్లు 49,103 మంది ఉన్నారు. వీరితోపాటు 20–29 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 4,58,817 మంది ఉన్నారు. 30–39 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 5,69,162గా ఉన్నారు. వీరంతా వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలుచేసే పార్టీవైపే మొగ్గు చూపే అవకాశం ఉంది.

బాబు పాలన మళ్లీ వద్దు...

2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. దాదాపు 600 హామీలు ఇచ్చి తుంగలో తొక్కారు. ఇంటింటికీ ఉద్యోగం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అనడంతో నమ్మి ఓటేసిన యువతీ, యువకులను సైతం వంచించారు. ఇంటింటికీ ఉద్యోగం ఇవ్వలేదు. మాట ప్రకారం ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి సైతం 2019 ఎన్నికల ముందు మూడు నెలలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పూర్తి స్థాయి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఎంత ఫీజు ఉన్నా ప్రభుత్వం నుంచి 35 వేలు మాత్రమే ఇచ్చారు. అవి కూడా సమయానికి ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులను కాలేజీలు బయటకు గెంటి వేశాయి. ఈ జ్ఞాపకాలన్నీ ఇప్పటికీ యువత మొదడుల్లో కదలాడుతుండటంతో మరోసారి బాబు కూటమికి ఓటు వేసి మోస పోకూడదని వారు నిర్ణయించుకున్నారు.

తోడుగా నిలిచిన వైఎస్ జగన్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో యువతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు బాసటగా నిలిచేందుకు పూర్తి స్థాయి ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను అమలు చేశారు. ఏడాదిలో మూడు సార్లు జగనన్న విద్యా దీవెన కింద తల్లుల ఖాతాల్లో ఫీజులను జమ చేశారు. అంతేకాక



కాలేజీల్లో చదువుకునే సమయాల్లో బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల కోసం ప్రతి విద్యార్థికి రూ.20 వేలను మూడు విడతల్లో చెల్లించారు. అంతేకాక సచివాలయ వ్యవస్థ రాకతో ఒకేసారి 1.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారు. పోలీసు, ఉపాధ్యాయ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ విధానంలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అక్షరాల 2.35లక్షల ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. ఇందులో కర్నూలు జిల్లాలోనే దాదాపు 19 వేల ఉద్యోగాలు భర్తీ కావడంతో ఎంతో మంది నిరుద్యోగం నుంచి బయట పడ్డారు.

సంక్షేమం, అభివృద్ధికే పట్టం

కర్నూలు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. 672 సచివాలయాల ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తోంది. ప్రతి గ్రామంలో ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రేరీలతోపాటు అవసరమైన రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణాలను చేపట్టింది. పేదలకు ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే వలంటీర్లు ఇంటికే వెళ్లి వృద్ధులకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక అందిస్తున్నారు.ఇంటికే వెళ్లి రేషన్ సరుకులు, ప్రజలకు అవసరమై సర్టిఫికెట్లు అందిస్తున్నారు. నాణ్యమైన వైద్య సేవలను గ్రామీణ ప్రజల దరికి చేర్చారు. కర్నూలులో జిల్లాలో ప్రపంచంలోనే అతి పెద్ద పంపుడ్ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటు చేశారు. కర్నూలులో విమానాశ్రయాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టుపై లా యూనివర్సిటీతోపాటు క్లస్టర్ యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ, ఐఐఐటీల నిర్మాణాలు చేపట్టారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో కేటాయిస్తూ తోడు నిలుస్తున్నారు. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి బలమైన నాయకుడి అడుగు జాడల్లో నడవాలని నిర్ణయించుకున్నట్లు యువతీయువకులు పేర్కొంటున్నారు.

సంక్షేమానికే నా మొదటి ఓటు



నాకు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. మొదటిసారి వేసే నా ఓటు అభివృద్ధి, సంక్షేమానికి నాంది పలికే పార్టీకే వేస్తా. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో పేదల పక్షాన నిలిచారు. సచివాలయ వ్యవస్థతో పరిపాలనను చక్కదిద్దారు. ఈ వ్యవస్థ ద్వారా ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి.

– అయేషాకౌసర్,ఆలూరు

మంచి చేసిన ప్రభుత్వానికే మద్దతు



సీఎం జగనన్న పేదల కోసం పాలన చేస్తున్నారు. నాకు తొలిసారి ఓటు హక్కు వచ్చింది. నాకు జగనన్న పాలనలో మంచి జరిగింది. వైఎస్ఆర్ వసతి, విద్యా దీవెనల కింద పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు హాస్టల మెస్ చార్జీల కోసం డబ్బులు అందాయి. మంచి చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను.

–అజ్మత్‌బాషా, కర్నూలు

వాళ్లకు గుణపాఠం తప్పదు



యువతకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలబడతారు. మోసం చేసిన వారిని గుర్తుంచుకుంటారు. ఇప్పుడు మళ్లీ 2014 పరిస్థితులను తేవాలని చూస్తున్నారు. అవన్నీ కుదరవు. మేలుచేసిన జగనన్నకు యువత అండగా నిలుస్తుంది. గతంలో మోసం చేసిన వారికి మళ్లీ గుణపాఠం తప్పదు. –మైబీ, చెన్నంపల్లి,

మామిడి పంటను కాపాడుకుందామిలా..

- అధిక ఉష్ణోగ్రతలతో పిందె, కాయ రాలే అవకాశం
- నివారణకు డ్రిప్ ద్వారా చెట్లకు నీటి తడులు ఇవ్వాలి
- బనవాసి కేవీకే శాస్త్రవేత్తల సూచనలు





మామిడిలో పిందె, కాయలు రాలుతున్న దృశ్యం



మామిడిలో పిందెనల్లి ఆశించిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మామిడిలో ప్రస్తుతం పిందె, కాయ రాలుతోంది. దీని వల్ల పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న మామిడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యను నివారించుకొని దిగుబడులు నష్టపోకుండా చేసుకోవడానికి బనవాసి కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త కె.అశోక్‌కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త వై.మౌనిక తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. '2023–24లో లోటు వర్షాపాతం, అధిక ఉష్ణోగ్రతల వల్ల పూత రాలడం, పిందె, కాయ సరిగా ఏర్పడకపోవడం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కొంతవరకు నష్టాలను అధిగమించవచ్చు. కాయ ఏర్పడే దశలో నేలలో తగినంత తేమ, నేల రకాన్ని బట్టి, ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడులు ఇవ్వాలి. డ్రిప్ ద్వారా నీటి తడులు ఇస్తే నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచవచ్చు. అయితే రైతులు రెండు, మూడు రోజులు మాత్రమే నీటి తడులు ఇవ్వకుండా ఎక్కువ రోజులు ఇవ్వాలి. కాయలు ఏర్పడే దశలో చెట్ల పరిమాణాన్ని బట్టి అరకేజీ యూరియా, 2 కిలోల పోటాషియం నైట్రేటు, 2 కేజీల వేప చెక్క కలిపి చెట్టు చుట్టూ గాడి తీసి వేయాలి. ఆ తర్వాత నీటితడి పెడితే కాయలు ఏ పెద్ద పరిమాణంలో పెరిగి అధిక దిగుబడి పొందవచ్చు. వర్షాధారంగా సాగు చేసే తోటల్లో లీటరు నీటి 15 గ్రాముల మల్టీకే, 10 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలి. పిండి పురుగుల నివారణకు డైమిథోయేట్ లీటరు నీటికి 2 మి.లీ. ప్రకారం కలిపి పిచికారీ చేయాలి'అని సూచించారు. మరిన్ని వివరాలకు 96032 93514 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ జారీపై ప్రత్యేక శ్రద్ధ సారించాలి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు అత్యవసర సేవలందించే 33 విభాగాలకు చెందిన వ్యక్తుల ఓటింగ్ కోసం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ అంశాల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాధికారులు, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అత్యవసర సేవలందించే వ్యక్తుల పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ప్రక్రియను బుధవారం సాయంత్రంలోగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మొత్తం సుమారు 36వేల పోస్టల్ బ్యాలెట్ల అవసరం ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి ఎలా అప్లయ్ చేసుకోవాలి, ఎవరికి సమర్పించాలి సంబంధిత ఫార్మెట్‌లపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గాల వారీగా నివేదికలను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సుమారు 12వేల సిబ్బంది, అత్యవసర సేవలకు సంబంధించి 2,806, విభిన్న ప్రతిభావంతులు 15,432, ఎనభై ఐదు సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్లు 5,769 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల వద్దనుండి హోం ఓటింగుకు అభ్యర్థన పత్రాలు తీసుకొని ఎంతమంది హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలను కుంటున్నారో వారి జాబితాను రూపొందించాలన్నారు. హోం ఓటింగ్ వినియోగించుకోవల్సిన వారు ఫారం–12డీని అందజేయాలన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న ఆలయ సిబ్బంది, పాల్గొన్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారం రోజున ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది ఈ నెల 26న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు మొదలైనవి సమర్పించడం అనవాయితీ. ఈ నేపథ్యంలో మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థాన ఏఈవో హరిదాసు, స్వామివారి ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్లు వీఆర్‌కు

కర్నూలు: గూడూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మధుమోహన్, సునిత, మధుశేఖర్, లోకేష్ యాదవ్ స్థానిక మండలానికి చెందినవారని, ఒకరు రాజకీయ పార్టీకి కొమ్ము కాస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపి, వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

అరటి ఆకుల మాటున కలప అక్రమ రవాణా

- స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు



కలపను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

మహానంది: నంద్యాల–గిద్దలూరు మార్గంలో గోపవరం నుంచి అటవీ కలపతో వెళ్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు వెంబడించి స్వాధీనం చేసుకున్నారు. చలమ ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వరయ్య, మొబైల్‌పార్టీ డిప్యూటీ డీఆర్‌ఓ నాగేంద్రనాయక్, ఎఫ్‌ఎస్‌ఓ ఎల్లమ్మలు తెలిపిన వివరాల మేరకు...వాహనాల తనిఖీలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా బొలేరో వాహనం అనుమానాస్పదంగా కనిపించిందన్నారు. ఆపకుండా వెళ్లడంతో వెంబడించి నంద్యాల సమీపంలోని కుందూ నది వద్ద పట్టుకున్నామన్నారు. పైన అరటి ఆకులు, కింద అటవీ కలప తరలిస్తున్నట్లు గుర్తించి గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద ఉన్న టింబర్ డిపోకు తరలించామని, విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా అందులో విలువైన నగ్రి (ఆస్ట్రేలియా వుడ్) తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ కలప విలువ కిలో రూ.లక్షల్లో ఉంటుందని ఓ అటవీ అధికారి తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎఫ్‌ఎస్‌ఓ ఎల్లమ్మ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తున్నామని త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపారు. స్థానిక విజయనగర్ కాలనీ, నూనెపల్లి, తాలుకా పోలీస్టేషన్ పరిధిలోని పోలూరు, చాపిరేవుల తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు.

అగ్ని ప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం



మృతుడు ఫారుక్ బాషా (ఫైల్)

పాములపాడు: మండల కేంద్రం పాములపాడులో సోమవారం అర్ధరాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాములుపాడుకు చెందిన షేక్ ఫారుక్‌బాషా (50) ఏకే ట్రేడర్స్ దుకాణం ఏర్పాటు చేసి ధాన్యం క్రయవిక్రయాలు చేస్తుంటాడు. రంజాన్ మాసం సందర్భంగా సోమవారం రాత్రి నమాజ్ పూర్తి చేసుకుని దుకాణానికి చేరుకున్నాడు. అయితే అర్ధరాత్రి సమయంలో దుకాణంలోని నుంచి మంటలు వ్యాపించి పొగలు వస్తుండటంతో స్థానికులు గమనించారు. వెంటనే ఫారుక్‌బాషా కుమారుడు అక్బర్ బాషాకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని దుకాణ షెట్టర్ తెరిచి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే ఖాళీ గోనెసంచులు అధికంగా ఉండటంతో మంటలు తీవ్రంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. గోనెసంచులపై పూర్తిగా కాలిపోయిన మృతదేహం కనిపించడంతో అందరూ భయపడ్డారు. ఆ మృతదేహం తన తండ్రి షేక్ ఫారుక్‌బాషాదేనని కుమారుడు గుర్తించాడు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్‌ఐ అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టు మార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో ఆదినారాయణ మృతదేహం

కర్నూలు: నగర శివారులోని డోన్ జాతీయ రహదారిపై హ్యాంగౌట్ హోటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరు మండలం పద్మావతి నగర్‌లో నివాసముంటున్న కురువ బాలన్న గారి ఆదినారాయణ (48) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తన అల్లుడు గిడ్డయ్యతో కలిసి మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి వెంగన్నబావి సమీపంలోని వెంకటేశ్వర నగర్‌లో ఉన్న శ్రీసాయి మారుతీ ట్రాన్స్‌పోర్టు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని వెనుక నుంచి ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న ఆదినారాయణ అక్కడికక్కడే దుర్మరణం చెందగా గిడ్డయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెల్దుర్తి మండలం లింగాలపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ శరీన్ నగర్‌లోని స్నేహ చికెన్ సెంటర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఇటీవలనే మానుకున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు దినేష్ కుమార్ కర్నూలు మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ చదువుతున్నాడు. క్షతగాత్రుడు గిడ్డయ్య కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీసి ఉంటే 9000334894, 9848220844కు సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ సీఐ గౌతమి కోరారు.

పాము కాటుతో మహిళ మృతి

చాగలమర్రి: మండలంలోని నేలంపాడు ఎస్సీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ బోల్లు విశ్వాసమ్మ (54) పాముకాటుకు గురై మంగళవారం మృతిచెందింది. ఎప్పటిలాగే కూలీలతో కలిసి పొలం పనులకు వెళ్లి కంకులు కోస్తుండగా పాము కాటు వేసింది. చాగలమర్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ముగ్గురు బాలికల అపహరణకు యత్నం

- సోషల్ మీడియా ద్వారా పరిచయం చేసుకున్న యువకుడు
- అవసరాలకు డబ్బు ఇస్తూ మచ్చిక చేసుకున్న వైనం
- స్కూల్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు
- రైలులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా గుర్తింపు
- ఇద్దరు క్షేమం, మరో బాలిక ఆచూకీ కోసం గాలింపు
- పోలీసుల అదుపులో యువకుడు

డోన్ టౌన్: బాలికలను ట్రాప్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఒక యువకుడిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న ఒక యువకుడు అమ్మాయిలను ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్ ద్వారా పరిచయం చేసుకుని వారికి అవసరాలకు డబ్బులు ఇచ్చి ట్రాప్ చేసి వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పట్టణంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు, 8వ తరగతి చదువుతున్న మరో బాలిక మంగళవారం మధ్యాహ్నం పాఠశాల వదలిన తర్వాత హైదరాబాద్‌కు వెళ్లేందుకు డోన్ రైల్వే స్టేషన్ చేరుకున్నారు. ఈ సమయంలో స్కూల్ వదలినా తమ బిడ్డలు ఇంటికి రాక పోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో పాఠశాలకు వెళ్లి విచారించారు. అందరు వెళ్లి పోయినట్లు పాఠశాల సిబ్బంది సమాధానం ఇవ్వగా అప్రమత్తమైన తల్లిదండ్రులు బస్టాండ్, రెల్వే స్టేషన్ చేరుకున్నారు. సరిగ్గా అదే సమయంలో డోన్ రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు – సికింద్రాబాద్ కదిలే రైలు ఎక్కుతుండగా తల్లిదండ్రులు గుర్తించారు. వెంటనే ఇద్దరు బాలికలను రైలు నుంచి దింపుకోగా మరో బాలిక అలాగే ట్రెన్‌లో వెళ్లి పోయింది. ట్రెన్ దిగిన ఇద్దరు బాలికలను డోన్ పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా డోన్ యువకుడి సూచనల మేరకు సరదాగా గడపటానికి హైదరాబాద్‌కు వెళుతున్నామని, అక్కడ ఒక ఓ మహిళ అడ్రస్ ఇచ్చాడని వారు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ మేరకు యువకుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లో వారి అడ్రసు, వారితో ఇతనికి ఉన్న పరిచయాలు తదితర వాటిపై పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసులపై నోరు పారేసుకున్న బైరెడ్డి శబరి

కర్నూలు: ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీడీపీ నాయకులు ఏదో ఒక విధంగా గొడవలు సృష్టించి పత్రికలకు ఎక్కుతున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన ఆ పార్టీ నేతలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అధికారులపై విరుచుకుపడుతున్నారు. తాజాగా టీడీపీ నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరి ఏకంగా పోలీసులపైనే నోరు పారేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్ నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. అయితే బైక్ ర్యాలీలో పాల్గొనే వ్యక్తులు, వాహనాల నెంబర్లు, పూర్తి చిరునామాతో పాటు ఇవ్వాలని, అంతవరకు అనుమతి ఇవ్వలేమని ఎన్నికల అధికారులు నిరాకరించారు. విషయం తెలుసుకున్న బైరెడ్డి శబరి మంగళవారం సాయంత్రం పార్టీ కార్యకర్తలను వెంటబెట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హంగామా సృష్టించారు. స్టేషన్ నిర్వాహకులు అందుబాటులో లేరని, వారు వచ్చిన తర్వాత మాట్లాడాలని ఏఎస్‌ఐ సూచించినప్పటికీ తాను ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఎందుకు ఇవ్వరంటూ పోలీసులను బెదిరించే పద్ధతిలో మాట్లాడారు. స్టేషన్ వద్ద కార్యకర్తలను ప్రోత్సహించి పెద్ద ఎత్తున నినాదాలు చేయిస్తూ ధర్నాకు సిద్ధపడ్డారు. ఏఎస్‌ఐ పలుమార్లు సర్ది చెప్పినప్పటికీ వినిపించుకోకపోవడం గమనార్హం. ఈ విషయంపై సీఐ శంకరయ్యను వివరణ కోరగా ఎన్నికల కోడ్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని.. ఎన్నికల ప్రచారంతో పాటు సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు వంటి వాటికి ఎన్నికల రిటర్నింగ్ అధికారితో కచ్చితంగా అనుమతి పొందాలన్నారు.

ఎమ్మిగనూరులో పట్టపగలే భారీ చోరీ

- 20 తులాల బంగారు ఆభరణాలు.. రూ.2 లక్షల నగదు అపహరణ



ఇంటి యజమానుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాధవరెడ్డి, సరితా దంపతులు రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. సరితా ఉపాధ్యాయురాలు కావటంతో ఉదయం డ్యూటీకి వెళ్లింది. మాధవరెడ్డి ఇంట్లోనే ఉంటూ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బైక్ రిపేరు చేయించుకోవడానికి బయటకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగ ఇంట్లోకి ప్రవేశించి బెడ్ రూమ్‌లోని బీరువా తాళం తీసి అందులో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించాడు. కాసేపటికి ఇంటికి వచ్చిన మాధవరెడ్డి తాళం తీసి ఉండటం చూసి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఇంట్లో వేలి ముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ టీం పోలీసులు పరిసర ప్రాంతం వరకు వెళ్లి వెనక్కి వచ్చింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.